రిక్షా దిగి పాపని తల్లికిచ్చి, డబ్బులిచ్చి రిక్షావాణ్ణి పంపేశాడు సారధి. పాపని ఎత్తుకుని, భార్యను ఫ్లాట్స్కి బయటిగేటు తోసుకుని ఒక్కొక్క అడుగే భారంగా వేస్తూ లోపలికి నడిచాడు. రాధ చూపులు కాంపౌండులోని పూలచెట్లపై నిలుచున్నాయి. రాధ వెంట వంటవాడు చంకనుండి జారిపోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు. కాలింగ్‌బెల్ నొక్కాడు సారధి. మరుక్షణంలో తలుపు తీసి ఎదట నిలిచాడు రంగడు. నవ్వుతూ నమస్కరించాడు.

"అమ్మగారున్నారా ఇంట్లో?"



"ఉన్నారండి. ఇప్పుడే పూజ అయింది. ఫలహారం చేసి, అయిదు నిమిషాల్లో వచ్చేస్తారు. రండి, లోపల కూర్చోండి" అంటూ విజిటర్స్‌రూంలోకి సాదరంగా ఆహ్వానించాడు. ఒక్క క్షణం తటపటాయించాడు సారధి.

"రాధా, పిల్లలకి కొత్త చొక్కాలేవో కావాలన్నావు కదూ. నేనలా పాపని తీసుకుని మార్కెటుకి వెళ్లి వచ్చేస్తాను. ఈ లోగా నీవు మాట్లాడెయ్" అన్నాడు హడావిడిగా సారధి.

రాధకు సారధి మాటల్లోని ఆంతర్యం గ్రాహ్యమయింది. ఏదో మిషపైన తనని ఒంటరిగా వదిలి రాబోయే దృశ్యాన్ని తిలకించడం ఇష్టంలేక తప్పించుకుంటున్నాడన్న విషయం స్పష్టమయింది. అయినా పైకేమీ కనబడనీయకుండా "అలాగే త్వరగా వచ్చెయ్యండి" అని అంది.

తల ఊపి పెద్ద పెద్ద అంగలు వేస్తూ పాపని ఎత్తుకుని వెళ్లిపోయాడు. వంటవాణ్ణి భుజంపైన జోకొడుతూ విజిటర్స్‌రూంవైపు నడిచింది రాధ.

గది చాలా అందంగా అమర్చబడి ఉంది. గోడపైన వెయిట్ అండ్ హైట్ ఛార్ట్, పక్కనే అస్థిపంజరం బొమ్మ, ఆ పక్కన మనిషిఅవయవాల బోధించే చిత్రం.

రంగడు సీలింగ్‌ఫాన్ ఆన్ చేశాడు. సోఫాలో కూర్చొని, ఎదురుగా టేబిల్‌మీద ఉన్న మేగజీన్లను తిరగేసింది. సీలింగ్‌ఫాన్ నీడ టేబిల్‌పైనున్న గాజుప్లేటులో గిరగిరా తిరుగుతూంది. ఫాన్‌నీడతో పాటు గతస్మృతుల నీడలు రాధ మస్తిష్కంలో పరిభ్రమించాయి.

సరిగ్గా సంవత్సరం క్రితం జరిగింది.

"రాధా, ఇలా చెప్పుతున్నందుకు మరోలా భావించకు. నీవు నా చిన్ననాటి స్నేహితురాలివనే భావనే తప్ప ప్రస్తుతం మనిద్దరి మధ్య డాక్టర్, పేషెంట్ సంబంధం లేదు. నీ పెళ్లయి ఆరేళ్లు దాటాయేమో! ఇది నీకు నాలుగో కాన్పు. ఇలా ఏడాది ఏడాది కాన్పులతో నీ ఆరోగ్యం ఎంత దెబ్బ తింటూందో నీకు తెలియంది కాదు. నీ ఆరోగ్యం క్షీణించడంవల్ల పిల్లల ఆరోగ్యం కూడా చెడుతుంది. మాతృత్వపు హక్కు నీనుండి లాక్కోవడానికి ఎవరికీ అధికారం లేనిమాట నిజమయినా పిల్లల్ని కనేముందు ఆర్థిక పరిస్థితి, ఆరోగ్యవిషయాలు ఆలోచించాలి. నువ్వు కొద్ది, నీమీద ఉన్న ప్రత్యేకమైన అభిమానంకొద్దీ

చెపుతున్న మాటల్ని తప్పుగా అర్థం చేసుకోవనుకుంటా'' అని డాక్టర్ మిస్ మాధవి చిలక్కి చెప్పినట్టు తనతో చెప్పుతూంటే తాను సిగ్గుతో కుంచించుక పోయింది. డాక్టర్ మాధవి చెప్పినట్లు తన ఆరోగ్యం సంగతి ఎట్లా ఉన్నా, తన భర్త ఉద్యోగం, తన కుటుంబం పరిస్థితులలో, తన నలుగురి పిల్లలకు ఓ మాదిరి తిండి, బట్ట ఇవ్వగలగడం సందిగ్ధమే.

డాక్టర్ మాధవి తన బాల్యస్నేహితురాలు. హైస్కూల్‌దాకా కలిసి మెలిసి ఒకరినొకరు విడవలేనంత దగ్గరగా మెలిగినవాళ్ళు. తాను హైస్కూల్‌చదువుతో మానేసి, ఒకటి రెండు సంవత్సరాలు ఇంట్లో కాలక్షేపం చేసి, పెళ్ళి సంబంధాల గొడవలలో మరో సంవత్సరం కానిచ్చేసి ఆ తరవాత సారధికి అర్థాంగి అయింది. మాధవి ఒక్కొక్క మెట్టే ఎక్కేసి, ఎం. బి. బి. యస్. పాసయి ప్రైవేటుప్రాక్టీసు పెట్టి డబ్బుకు డబ్బు, సంఘంలో హోదా పుష్కలంగా గడించిన అదృష్ట వంతురాలు.

డాక్టర్‌మాధవి మాటల్ని సారధి, రాధ తీరిగ్గా చర్చించుకున్నారు. మాధవి సలహాలో నూటికి నూరు పాళ్ల నిజం దాగుందని ఇద్దరికీ గోచరించింది. ఈ నాలుగో కాన్పుతో ఫుల్‌స్టాప్ పెడదామని నిశ్చయించు కున్నారు. కాని ఆలోచనలకూ ఆచరణలకూ ఉన్న దూరమే ఇక్కడా ప్రత్యక్షమయింది. సారధి 'వేసక్టమీ' చేయించుకుంటానన్న రోజు తాను వద్దు వద్దంటూ గోల పెట్టింది. నమ్మకంలేక తనపైన, పిల్లలపైన ఒట్టు వేయించుకుంది. ఓ నెల రోజుల తరవాత సారధి ఆఫీసునించి సాయంత్రం తిరిగి రాగానే ''మాధవి వచ్చి వెళ్లింది. మన కిష్టమయితే ఈ కాన్పుతోపాటుగా ఆపరేషన్ ఏర్పాట్లు తానే స్వయంగా చేస్తానంది!'' అని చెప్పటం పూర్తికాకుండానే ''మీ మాధవికేం ఏమైనా అంటుంది. తనకూ పెళ్ళయి, పిల్లలు కలుగుతూంటే తెలిసివచ్చేది. అప్పుడు ఈ మాటలేవీ గుర్తుండవు. అయినా ఒకరు తనకు చెప్పేదేమిటి. ఆ జాగ్రత్తలేవో మనమే తీసుకుందాం'' అన్నాడు సారధి.

ఆవేశంలో ఏమో అన్నాడే కాని రాధ మళ్లీ నెల తప్పిందన్న విషయం అశ్రువులు రాలుస్తూ బెదురు బెదురుగా చెప్పుతూంటే సారధి పిచ్చివాడిలా జుట్టంతా పీక్కున్నాడు. భోరుమని ఏడుస్తున్న రాధని ఊరడించా లన్న ఆలోచనకూడా తట్టలేదా సమయంలో. రెండు రోజులు అన్నం నీళ్లూ మానేసి, బాగా ఆలోచించిన పిమ్మట ఒక నిర్ణయానికి వచ్చారు. తత్ఫలితంగానే ఈ రాక.

'మాధవికి మొహమెట్లా చూపించడం?' సిగ్గు, అవమానంతో కుతకుతలాడుతున్న సమయంలో రంగడు వచ్చాడు.

''అమ్మగారు గదిలోకి వచ్చారు. రమ్మంటున్నారు'' అన్నాడు. బాబుని సోఫాపైన పడుకోబెట్టి నెమ్మదిగా స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని మాధవి గదిలోకి ప్రవేశించింది రాధ. మాధవి తన మొహానికడ్డంగా ఉన్న పేపరు తొలగించి, చూసి చకితురాలయింది. ''హల్లో రాధా నువ్వా, రంగడు నువ్వని చెప్పనే లేదు! కూర్చో కూర్చో!'' అంటూ టేబిల్‌పైన కాలింగ్‌బెల్ నొక్కింది.

రంగడు తలుపులు తెరుచుకుని వచ్చాడు.

*బిడ్డలు పుట్టకముందు బరువుగా కనిపిస్తారుగానీ, పుట్టిన బిడ్డ ఏ తల్లికీ బరువు కాదు. ఆర్థిక పరిస్థితులు ఎదురుతిరిగినా, మాతృ హృదయంలోని మమత ఎండి పోదు. ఒకరి సంతృప్తికోసం ఏ త్యాగమైనా చేయవచ్చునుగానీ, కన్నబిడ్డను త్యాగం చేయడానికి ఏ కన్నతల్లీ అంగీకరించదు.*

---

''ఏరా ఫూల్, రాధమ్మగారని చెప్పలేదేమిరా?'' కోపంలో రుసరుస లాడింది మిస్ మాధవి.

రంగడు మొహమాట పడిపోతూ, ''సమయానికి అమ్మగారి పేరు గుర్తు రాలేదండి. పేరు సరిగ్గా చెప్పకపోతే మీరు తిడతారని. . .'' అని పూర్తి చేయనివ్వకుండానే

''గొప్పపని చేశావు. వెళ్లి వెంటనే కాఫీ తీసుకురా'' అంటూ పురమాయించింది.

రాధ, 'వద్దని' వారించినా ప్రయోజనం లేకపోయింది.

''బాబేడీ ఒంటరిగా వచ్చావా? మీవారేరీ?'' మాధవి వేస్తున్న ఒక్కొక్క ప్రశ్నకి నెమ్మదిగా సమాధానాలు పూర్తిచేసేలోగా కాఫీ వచ్చేసింది. రాధ కాఫీ తాగడం పూర్తిచేసేలోగా డాక్టర్ ఏవో కాగితాలు పరీక్షించడంలో నిమగ్నురాలయింది. రాధ కాఫీకప్పు పక్కన బెట్టి, అయోమయంగా గోడలవైపు, కప్పువైపు చూడ నారంభించింది.

''ఊ. ఏమిటి విశేషం? అకస్మాత్తుగా ఇలా ఊడిపడ్డావేం? అంతా కులాసాయేకదా?''

ఔనని తల ఊపింది రాధ.

మాధవి నిశితంగా రాధవైపు చూసింది. రాధ మొహంలో కొట్టవస్తున్నట్టు ఆత్రత, వేదన, భయాందోళనలు కనబడుతున్నాయి. మాధవి కుర్చీ నుండి లేచింది. రాధ భుజాలు పొదవి పట్టుకుని ''రాధా, అబద్ధాలాడటం ఎప్పుడు నేర్చుకున్నావు? నీవు ఆడదలుచుకున్నా నీ కళ్లు ఆడనీయవు సుమా'' అంది నవ్వుతూ.

అప్పటివరకూ ఎంతో కష్టంపైన, నిగ్రహంతో ఆపుకున్న దుఃఖం ఈ అనునయంతో కట్టలు తెంచుకు పొంగి పొర్లింది. మాధవి ఒళ్లో తల పెట్టుకుని బావురుమంది.

● ● ●

''రాధా!'' దిక్కులు పిక్కటిల్లేలా కేకవేసింది మాధవి. కళ్ళు నిప్పులు కురిపిస్తున్నాయి. క్షణంలో మాధవిలో కనిపించిన మార్పు రాధని తల్లడిల్ల చేసింది.

''రాధా, ఈ నీచమైన ఊహ నీ కెలా తట్టింది? ఇటువంటి దుర్మార్గానికి మీవారి సపోర్టెలా లభించింది? ఏ మొహం పెట్టుకొని ఈ పాపపుపనికి నన్నొడిగట్టమని అడిగేందుకు వచ్చావు?''

రాధ నిరుత్తరయింది.

''పాపపుణ్యాల ప్రసక్తి అటుంచు. చట్టరీత్యా ఇది ఒక పెద్ద నేరమన్న విషయం మీకు తెలీదా? తెలిసే ఈ సాహసానికి పూనుకున్నారా?''

రాధ అవమానంతో, సిగ్గుతో, భయంతో కుంగి పోయింది.

''నే నానాడే చెప్పానే, బాబు పుట్టగానే ఆపరేట్ చేస్తానని. అప్పుడెందుకో ఒప్పలేదు? ఈ రోజు ఈ పనికి నీ మనస్సెలా అంగీకరిస్తుంది. ఇప్పటికైనా తెలివిగా ఈ కాన్పు అవడంతోటేఆపరేషన్ చేయించుకో. ఈ విషయంలో నా సంపూర్ణ సహకారం నీకు లభిస్తుంది. . .''

రాధ ఇక భరించలేకపోయింది.

''మాధవీ, మంచో చెడో, తెలిసో తెలియకో పొరపాటు జరిగిపోయింది. నీకు చేతనైతే నే నడిగినట్టు చేసిపెట్టు. కాకపోతే కాదని చెప్పు. వెళ్లిపోతాను. స్నేహితురాలవని, నా కష్టాల నాదుకుంటా వని ఆశతో నమ్మి వచ్చానే గాని నీ దగ్గిర ధర్మోపన్యాసాలు నీతివాక్యాలు విందామని రాలేదు. థాంక్స్. జీవితానికి సరిపడ్డబుద్ధి చెప్పావు'' అంటూ చర్రున లేచి నిలబడింది రాధ.

మాధవి, రాధని బలవంతంగా సీట్లో కూర్చో బెట్టింది.

''పిచ్చిదానా,. . . ఏదో ఆవేశంతో, ఉన్మాదంలో మాట్లాడుతున్నావు. నీవు చేద్దామనుకుంటున్న పని ఎంత ఘోరమో కొంచెం శాంతంగా ఆలోచిస్తే నీకే అర్థమవుతుంది. నా మాట విను. అటువంటి పిచ్చి పిచ్చి ఆలోచనలు మానెయ్. డబ్బు సాయమేమైనా కావలిసివస్తే నేను చేస్తాను'' అంది.

రాధ ఈ మాటతో మరి కాస్త రెచ్చిపోయింది.

''క్షమించు. డబ్బులేని కారణంగానే ఈ అవమానం పొందాను. బాగా డబ్బున్న పేషెంటుకు నీవీ సలహా ఇచ్చేదానివా?. . . సరే, ప్రపంచంలో అందరూ డాక్టర్ మాధవి వద్దకే వెళ్లడం లేదు. గంతకుతగ్గ బొంత మాకూ దొరకక పోదు.'' అంటూ గబగబా గుమ్మంవైపు కదిలింది.

''రాధా!'' తీవ్రంగా పిలిచింది మాధవి.

వెనక్కి తిరగకుండానే ఆగింది రాధ.

''ఏదైనా అఘాయిత్యం తలపెట్టావా, నీ ప్రాణానికే ముప్పు. అంతేకాదు నా అంతట నేను ముందుకు వచ్చి పోలీసురిపోర్టు చేస్తాను.'' రాధ గిరుక్కున మాధవివైపు తిరిగి ''థాంక్స్'' అని స్ప్రింగ్‌డోర్‌ని బడాల్న తెరుచుకుని బయటపడింది.

మాధవి అప్రతిభురాలైంది.

భుజంపైన బాబుని పడుకోబెట్టుకుని, మరో చేత్తో పాపను పట్టుకున్న సారధి, స్ప్రింగ్‌డోర్‌ని దురుసుగా తెరుచుకుని, చింతనిప్పుల్లాంటి కళ్లతో తూలుతూ ముందుకు వస్తున్న రాధ ఆకారాన్ని చూసి 'ఏదో పెద్ద ఉపద్రవమే' అని మనస్సులో గొణుక్కున్నాడు. మారు మాట్లాడకుండా, రాధతో పాటుగా కాంపౌండుగేటు దాకా నడిచాక ఆదుర్దాతో ''ఏం అలా ఉన్నావేం? మాధవి ఏమంది?'' అన్నాడు.

(తరువాయి 34 వ పేజీలో)

**గిరీశం**

(31 వ పేజీ తరువాయి)

"ఏట్లో పడమంది" కస్సుమంది రాధ.

* * *

వచ్చిపోయే జనంతో పబ్లిక్‌గార్డెన్ రద్దీగా ఉంది. అంతగా జనసమ్మర్దం లేనిచోట ఓ మూల పచ్చికపై కూర్చున్నారు సారధి, కృపానిధి. సారధి చెప్పినదంతా ఓపిగ్గా విని.

"సారధీ, నేనూ డాక్టర్ మాధవితో పూర్తిగా ఏకీభవిస్తాను. ఆవిడ సలహాను అక్షరాలా అమల్లో పెట్టడమే ప్రస్తుత కర్తవ్యం" అన్నాడు కృపానిధి.

"నీకేమోయి కృపానిధీ, పిల్లాజెల్లా లేనివాడివి. తేలిగ్గా మాట్లాడేస్తావు. కాస్త నా పరిస్థితుల్లో నిన్నూహించుకో. నాకు వచ్చే ఈ గొర్రెతోకజీతంతో ఇప్పటికి ఉన్నవాళ్లని పోషించడమే గగనమై పోతూంటే మరో ఎడిషన్‌ని ఎలా భరించడం?" అన్నాడు కొంచెం కటువుగా. అన్న మరుక్షణంలోనే తనమాటలవల్ల కృపానిధి నొచ్చుకోలేదు గదా అనికూడా బాధపడ్డాడు. కృపానిధి చిరునవ్వుతోనే సారధి భయాన్ని తొలగించాడు. ఒక నిమిషం ఇద్దరూ మౌనం అనుభవిస్తూ ఉండిపోయారు.

"సారథి, నీకో పరిష్కారమార్గం చెప్పనా?"

"ఊఁ" అన్నాడు సారధి శూన్యంలోకి చూస్తూ.

"నిజంగా, నీకీ రాబోయే పిల్లోపిల్లడో 'బరువు' అనిపిస్తే నా కిచ్చెయ్. నే నానందంగా స్వీకరిస్తాను."

సారధి పెద్దదెబ్బ తిన్నాడు. చాలాసేపటివరకు నోట మాట రాలేదు. మళ్లీ కృపానిధే "నిజంగా. నేను వేళాకోళం చేయడం లేదు. మాకు పిల్లలులేని మాట నిజమే. అయితే ఇంతకాలం తీవ్రంగా పిల్లలు లేరే అని మే మేమీ బెంగ పెట్టుకోలేదు. అలా ఇదయిన వాళ్లమయితే ఈ పాటికి మా బంధువుల్లో ఎవరినైనా దత్తు తీసుకునేవాళ్లం. ఎలాగూ సమయంతోబాటు సందర్భం కలిసివచ్చింది గనక ఉభయతారకంలా ఉంటుంది. అటు నీకు ఏదో చేయరాని కార్యం చేశానన్న దిగులూ ఉండదు. నాకూ తృప్తి కలుగుతుంది. ఏమంటావ్" అన్నాడు.

సారధి అయోమయంగా కృపానిధివైపు చూసి "నిజంగానా?" అన్నాడు అంతకంటే ఏమనాలో తెలీక.

"నిజమేనోయ్. ఈ సారి బిడ్డను నాకోసం కనవోయ్' అన్నాడు కృపానిధి నవ్వుతూ.

* * *

మరుసటిరోజు కృపానిధి భార్యతో సారధి ఇంట్లో అడుగు పెట్టేసరికి భార్యాభర్తల మధ్య ఏవో తీవ్ర వాదోపవాదాలు జరిగినట్టు గమనించాడు. కాఫీ ఫలహారాల అనంతరం కృపానిధే కదిపాడు.

"ఏమోయి సారధీ, నిన్న మన ఒడంబడిక మీ దంపతులిద్దరికీ అంగీకారమే కదా?"

సారధి ఒక్క క్షణం తటపటాయించాడు.

"అబ్బే, అంగీకరించక పోవడానికి పెద్ద ఏముం దిందులో? ఎలాగూ ముందనుకున్నదే కదా...కాని. . ." అంటూ నసిగాడు.

"ఊ కానేమిటి?"

"అబ్బే మరేంలేదు నలుగురూ నాలుగు రకాలు అనుకుంటారేమో అని మా ఆవిడ భయపడుతూంది" అన్నాడు సారధి, రాధవైపు అదో రకంగా చూసి. రాధ సిగ్గుతో తల పక్కకు తిప్పుకుంది. కృపానిధి భార్య కమల నవ్వింది.

"ఇందులో ఇతరుల ప్రసక్తి మనకెందుకండీ? మీకు రత్నాల్లాంటి నలుగురు బిడ్డలున్నారు. ఈ అయిదవ బిడ్డ కలగడం మీ కిష్టం లేదు. ఆ బిడ్డను మరోవిధంగా మాయంచేసి జీవితాంతం ఏదో నేరం చేశామన్న దిగులుకంటే మీకు దూరంగా ఉన్నా ఎక్కడో అక్కడ మీ బిడ్డ క్షేమంగా ఉన్నాడన్న తృప్తి మీకు మిగులుతుంది. మాకూ ఓ చక్కనిబిడ్డ ఉన్నాడన్న ఆనందం ఉంటుంది. ఈ పద్ధతివల్ల ఇరు పక్షాలకూ సంతోషమే కాని మోసమూ, వంచనా జరగవు. అందువల్ల, మీరు ఈసారికి మీ కిష్టం లేకున్నాసరే, మా కోసం, కేవలం మా కోసమైనా బిడ్డను కని ఇవ్వండి." పూర్తిచేసేసరికి రాధకి చెమట పట్టేసింది. ఏం మాట్లాడాలో తెలీకుండా "అవుననుకోండి" అంటూ నీళ్లు నమిలింది.

"అయితే ఓ షరతు. ఈ బిడ్డ నిజానికి మీ స్వంతబిడ్డే అయినా, మన ఒప్పందం ప్రకారం ఆ బిడ్డపై సర్వహక్కులు మావి. కాబట్టి ఆ బిడ్డ పాలన, పోషణ వగైరా అన్ని విషయాలపై మాకు పూర్ణస్వాతంత్ర్యం ఉంటుందని మీకు ప్రత్యేకించి చెప్పనవసరం లేదనుకుంటాను. మా బిడ్డ అందంగా, ఆరోగ్యంగా, దబ్బపండు ఛాయలో మెరిసి పోవాలని మేము కోరుకోవడంలో తప్పేమీ లేదని మీరూ ఒప్పుకుంటారు. అందుకని. . ."

"అందుకని. . ." అన్నాడు సారధి విస్మయంతో.

"సారధీ, నేను చెప్పబోయే విషయం మీకు విడ్డూరం అనిపిస్తుండవచ్చు. నేను ముందే చెప్పాను అందులో మా స్వార్థం పాలు ఎక్కువని. అందుకని, అలాంటి బిడ్డ కలగాలంటే తల్లి బలవర్ధకమైన ఆహారం, పళ్లరసాలు, టానిక్కులు వాడాలి. మీరు అన్యధా భావించవద్దు. ఆ బిడ్డను మాకు సురక్షితంగా అప్పచెప్పేవరకు మీకు ఈ సందర్భంలో. అయ్యే ఖర్చంతా మాది"

రాధ, సారధి కొద్ది క్షణాలు మ్రాన్పడిపోయారు. సారధి తేరుకుని "కృపానిధీ, మమ్మల్నీ రకంగా అవమానించడంలో నీకు తృప్తి కలుగుతూందా?" అన్నాడు.

"ఇదిగో అంత్యనిష్ఠూరంకన్నా ఆదినిష్ఠూరం మేలని అనుకునేవాళ్లలో నేను ఒకణ్ని. ఇటువంటి వ్యవహారాలలో సిగ్గు, మొహమాటం, నటనలు నాకు నచ్చవు. నాకు సరి అని తోచిందేదో కుండబద్దలు కొట్టినట్టు చెప్పుతాను. ఈ షరతు అంగీకరించే పక్షంలోనే నీ బిడ్డను స్వీకరిస్తాను. తొందరేం లేదు. మీ ఇద్దరూ బాగా ఆలోచించుకునే ఓ నిర్ణయానికి రండి. మేం వస్తాం."

వెళ్లిపోతూ, వెళ్లిపోతూ కమల ఆశగా రాధవైపు చూసి "ఏమండీ, మాకోసం ఒక చక్కటి బిడ్డను కని ఇస్తారు గదూ" అంది. రాధకు ఏం జవాబియ్యాలో తెలియక నవ్వేసి ఊరుకుంది. సారధి శూన్యంలోకి చూస్తూ నిలబడ్డాడు.

* * *

వారం గిరుక్కున తిరిగింది. ఈ వారంలో అయిదు మార్లు కమల పళ్లబుట్టలను, ఫలహారాలను పట్టించుకు వచ్చింది. రాధకీ పరిస్థితి అగమ్యగోచరమైంది. వద్దని వారిద్దామని నాలిక చివరిదాకా వచ్చినమాట వాళ్లేమైనా బాధ పడతారేమో అని మనస్సుచేసే ఉపదేశంతో వెనక్కి జరిగిపోయేది. తప్పించుకోవాలన్నా తప్పని పరిస్థితి. బలవంతం చేసి మరీ తినిపించేది కమల. కడుపులోకి వెళ్లగానే దేవినట్టయ్యేది. ఎవరి దానధర్మాల వల్లో అయాచితంగా పొట్ట పోషించుకుంటున్నట్టు శరీరంలోని ప్రతి అంగం మొ రా యి ం చే ది. "రాధగారూ, మీ రెప్పుడూ కులాసాగా ఆనందంగా ఉండాలి. అయ్యో అంతలేసి బరువు లెత్తవద్దండీ. దయచేసి కనీసం మమ్మల్ని, కటాక్షించి ఆ పనులు మానేయండి. విశ్రాంతి తీసుకోండి. తల్లి క్షేమమే పిల్ల క్షేమం."

"అమ్మ బాబోయ్! ఇంకేమైనా ఉందా? గ్రహణం విడిచేదాకా ఓ మూల కదలకుండా పడి ఉండాలి గాని అలా తిరగవచ్చా?"

నిశ్చల సౌందర్యం ఫోటో—వేణుగోపాల్ (గుంటూరు)



30—10—68

"కావాలంటే, ఈ మూడు నెలలూ మా పనిమనిషిని మీ ఇంటికే పంపిస్తాను."

ఇలా కొన్ని వందలు, వేలు సలహాలు కమల పారేస్తుంటే రాధ పాతాళంలోకి కుంచించుకుపోయేది. ఒక్కొక్కసారి ఆ గృహం ఉప్పెనలో పొంగుకు వచ్చేది.

"గర్భిణీ స్త్రీలగురించి మీరు నాకు చెప్పెడ మేమిటి? అని ఎప్పుడో ఒకప్పుడు టక్కున సమ్మెట పోటులా వినిపిద్దామనుకుని, నిగ్రహించుకునేది రాధ. దీనికితోడు వారం, వారం డాక్టర్ మల్లిక మెటర్నిటీ హోమ్‌కి టాక్సీలో వెళ్లి రావడం, మెడికల్‌చెకప్ ఆవిడ ఖచ్చితంగా ఇచ్చే సలహాలు విధిగా పాటించి, ఆమె రాసిఇచ్చే మందులదుకాణాన్ని తానింటికి చేరవేసుకోడం తప్పనిసరి అయిపోయింది. ఒక్కోసారి రాధకి పిచ్చెత్తి పోతుందేమోనన్న ఆవేశం ముంచుకు వచ్చేది. కొన్ని సమయాల్లో వెక్కి వెక్కి ఏడ్చేది. 'భగవంతుడా, ఈ కష్టంలోంచి తొందరగా బయటపడేయి' అని మనసారా కోరేది. ఏది కష్టం? అన్నది భగవంతుడికే తెలియాలి. ఈ ఖర్చంతటినీ కృపానిధే భరిస్తుండడం, సారథి మౌనంగా జరుగుతున్నవన్నీ చూసీచూడనట్టూరుకోవడంతో రాధ సెగపొగలతో రుసరుస మంటూండేది.


హఠాత్తుగాకృపానిధికినాగ్‌పూర్‌కి ట్రాన్స్ఫరయింది. రెండు మూడు రోజుల్లో బయలుదేరి పోయాడు. బయల్దేరుతూ కృపానిధి, కమల చివరిసారిగా రాధని ఆరోగ్యం గురించి తీసుకోవలిసిన శ్రద్ధ, మరికొన్ని పాటించవలిసిన సూత్రాలు చెప్పి, కాన్పు రాగానే టెలిగ్రాంద్వారా తమకి తెలియజెయ్యమని కోరి నెల రోజులవగానే తమ సొత్తును తాము స్వీకరిస్తామని హామీ ఇచ్చి మరీ వెళ్లారు. వెడుతూ వెడుతూ కృపానిధి సారథిని ఏకాంతంగా పిలిచి "ప్రస్తుతానికి డబ్బుంచండి. డా. మల్లిక మెటర్నిటీహోంలోనే చేర్పించండి. మల్లికగారితో నే నన్ని విషయాలు మాట్లాడే వచ్చాను. డబ్బుసంగతి నాకు వదిలేయండి" అని రెండు పచ్చ నోట్లను చేతిలో పెట్టాడు. మారుమాట్లాడకుండా సారథి పుచ్చుకున్నాడు.

ఎంత నివారించినా, రాధ సారథితోపాటుగా స్టేషన్‌కి రాకమానలేదు. అప్పటివరకూ ఎవరి మనస్సుల్లో ఎంత కల్మషం దాగుందో కాని, ఇరు పక్షాలకూ వీడ్కోలు సమయంలో కన్నీళ్లు మాత్రం తప్పలేదు.

* * *

మొహంమీద చెమట తుడుచుకుని, పదేపదే 'లేబర్ రూం' వైపు చూస్తూ, క్షణమొక యుగంగా గడుపుతున్నాడు సారథి. జేబులో టెలిగ్రాం ఫారం భద్రంగా మడిచిపెట్టి ఉంచుకున్నాడు.

తలుపు కిర్రుమని చప్పుడు చేయడం, వెన్వెంటనే నర్సు బయటికి నవ్వుతూ వచ్చి "కంగ్రాచ్యులేషన్స్, మేల్‌చైల్డ్" అనడం జరిగాయి. మళ్లీ తానే "సారీ, మీరిప్పుడు చూడ్డం వీలుపడదు. మరో ఇరవై నిముషాలైనా కనీసం ఓపిక వహించాలి." ముసిముసి నవ్వులు ఒలకబోస్తూ అంది. 'అలాగే' అన్నట్టు తలఊపి గబగబా అంగలు వేస్తూ హాస్పిటల్ ఆవరణ బయటికి చొచ్చుకు వెళ్లాడు. టెలిగ్రాం పంపి, గుండెలపైనుండి పెద్దబరువు తొలిగినంత తేలిక పొందాడు. ఆస్పత్రి కాంపౌండులోకి అడుగు పెట్టగానే తనకి శుభవార్త తెలిపిన నర్సు "డాక్టరుగారు



పగ - పౌరుషం ఫోటో—సంపత్ (హైదరాబాద్-1)

మిమ్మల్ని ఓసారి కలుసుకోమంటున్నారు" అంది.

తడబడుతున్న అడుగులతో సారథి డాక్టరు మల్లిక ఎదుట నిలుచున్నాడు.

"కంగ్రాట్స్ మిస్టర్ సారథీ, అబ్బాయి చాలా ఆరోగ్యంగా, బరువుగా ఉన్నాడు. కనుముక్కుతీరుకూడా ఎంతో బావున్నాయి. అయితే ఒక సర్‌ప్రైజు, అబ్బాయికి మీ ఇద్దరి కాంప్లెక్షన్ రాలేదు. కారు నలుపు. మీ నలుగురు పిల్లలు తెల్లగా ఉన్నారు. మరి ఈ అబ్బాయికి ఇంత నలుపురంగు ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు."

సారథి అప్రతిభుడై, రెండు నిమిషాలవరకు స్తంభించిపోయేడు. సారథి మనస్సు అర్థం చేసుకున్న 'డాక్టరు' మౌనంగా తన పనిలో లీనమయింది. తూలుతూ, బయటపడ్డాడు సారథి. డాక్టరుమాటలు ఒక్కొక్కటి శూలంలా గుండెలను తూట్లు చేస్తున్నాయి.

'కృపానిధికీ విషయం తెలిస్తే ఎంత మథనపడి పోతాడు? పాపం కమల, ఎంతో ఆశతో కలలుకంటూ ఉంది.' గడిచిన సంఘటనలు ఫిల్ముకీలులాగా కళ్ల ఎదుట కనిపించి మాయమవుతున్నాయి. నర్సుపర్మిషను పుచ్చుకుని రాధ గదిలోకి నడిచాడు. ఏమిటో నీరసంగా ఉంది రాధ. మగతగా కళ్లు మూసుకుంది. పక్కనే అపరగోపాలకృష్ణుని బోలిన పసివాణ్ణి హృదయాని కదుముకుని ఏవేవో సుందరస్వప్నాలతో తేలిపోతూంది. "హాఁ నెలరోజుల అనుబంధం" అనుకుని బయట పడ్డాడు సారథి.

* * *

"రాధా, ఏమిటీ మొండితనం? మతి స్తిమితంగా ఉండే మాట్లాడుతున్నావా?" కర్కశంగా అరుస్తున్నాడు సారథి.

"ఆఁ మీరేమైనా అనండి. నేను భరిస్తాను. నా బిడ్డని నానుండి వేరుచేస్తే నే నూరుకోలేను" కటువుగానే జవాబిచ్చింది రాధ.

"ఈ తెలివి అప్పుడెటు పోయింది? ఈ మాట అప్పుడెందుకనలేదు? వాళ్లకి మాట ఇచ్చి వాళ్ల డబ్బుని మంచినీళ్లలా ఖర్చుపెట్టి, ఆఖరిక్షణంలో మనస్సు మార్చుకుంటే, కృపానిధి దృష్టిలో మనమే మవుతాం? ఇంతకంటే ఘోరం, ద్రోహం మరో టేముంటుంది?"

"ఇదిగో ఇదివరకు అర లక్షసార్లు చెప్పాను. మళ్లీ చివరిసారిగా చెప్తున్నాను. మీ నీతివాక్యాలు నన్ను మార్చలేవు. వీణ్ణి బలవంతంగా నా నుండి వేరుచేయడం జరిగితే మళ్లీ మీకు నా శవమే కనిపిస్తుంది" అంటూ గోపాలకృష్ణుని ముద్దాడుతూ వంటింట్లోకి నడిచింది. సారథికి కళ్లు బైర్లు కమ్మాయి. తల గిర్రున తిరిగిపోయింది. కుప్పలా కూలిపోయేడు.

* * *

"కృపానిధీ,

నన్ను క్షమించమని అడిగేందుకుకూడా అర్హత కోల్పోయాను. నేను కృతఘ్నుణ్ణి. ఇచ్చినమాట నిలబెట్టుకోలేకపోతున్నాను. జీవితాంతం ఈ నేరం నన్ను కాల్చుకు తినకమానదు. వచ్చేజన్మలోనైనా నీ ఋణం తీర్చుకునే అవకాశం భగవంతుడు నాకు కల్పించాలని ప్రార్థిస్తున్నాను. కనీసం నీవు నా గురించి ఖర్చుపెట్టిన డబ్బును అంచెలవారీగా తీర్చుకునేందుకు వీలు కల్పించమని నిన్ను వేడుకుంటున్నాను.

మిత్రద్రోహి
సారథి."

పరితపిస్తూ సారథిరాసిన ఉత్తరానికి తిరుగుటపాలో వచ్చిన సమాధానం ఇది:

"పిచ్చిసారథి,

నీ ఉత్తరం మా కేలాంటి విస్మయమూ కలిగించ లేదు. ఏ తల్లీ మరొకరికోసం ఆ బిడ్డను కనలేదు అన్న స్పటికంలాంటి నిజం మాకు ముందే తెలుసు. తెలిసే ఈ నాటకమాడాము. అందుకుగాను మమ్మల్ని క్షమించు.

కృపానిధి"

సారథి కొయ్యబారేడు. కృపానిధి నాటకమాడాడా? ఎవరికోసం? ఎందుకోసం? ఈ వాటికీ అవి శేషప్రశ్నలుగానే నిలిచిపోయాయి. ★